నిరుద్యోగం.. నైపుణ్యం లేని శ్రామికులు..

స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గడంతో.. పట్టణాలకు వలసలు అధికమయ్యాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు పెరిగింది. ఈ రేటు వ్యవసాయేతర అసంఘటిత శ్రామిక రంగంలో జనసమ్మర్దం (congestion) అధికమవడానికి దారి తీసింది. నైపుణ్యం ఉన్న కార్మికుల కొరత, మిగులు శ్రామికులు ఎక్కువగా ఉండటం, శ్రామిక చట్టాలు సరిగా అమలు కాకపోవడం, శ్రామిక సంఘాలు పటిష్టంగా లేకపోవడం వల్ల.. అసంఘటిత రంగంలో శ్రామికుల వేతనాలు తక్కువగా ఉంటున్నాయి. వివిధ ప్రణాళికల్లో ఉపాధి కల్పన కోసం పలు పథకాలను అమలుచేస్తున్నప్పటికీ.. ఏ ప్రణాళికలోనూ శ్రామికుల నైపుణ్యం పెంచేందుకు దోహదపడే స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. సేవా రంగంలో విద్యావంతులైన నైపుణ్యం గల వారికే ఉపాధి లభ్యమవుతుంది. నైపుణ్యం లేని శ్రామికుల్లో దళితులు, వెనుకబడిన తరగతులకు చెందినవారు ఎక్కువ.

దేశంలో 2004-05లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో కలిపి మొత్తం ఉద్యోగిత 457.5 మిలియన్లు. ఇందులో 86 శాతం మంది శ్రామికులు అసంఘటిత రంగంపై ఆధారపడి ఉన్నారు. కాగా వ్యవసాయరంగంలో శ్రామిక శక్తి వాటా 64 శాతం. వ్యవసాయే తర రంగాల్లో ఉపాధి 1999-2000, 2004-05 మధ్య కాలంలో 32 నుంచి 36 శాతానికి పెరిగింది. ఈ పరిమాణం వ్యవసాయేతర రంగాల్లో పెరుగుతోన్న డిమాండ్‌ను సూచిస్తుంది. అయితే శ్రామికశక్తిలో ప్రవేశించే నైపుణ్యం ఉన్న శ్రామికుల సంఖ్య చాలా తక్కువ కావడం గమనార్హం.

దేశంలో 2008-09 ముందు కాలంలో జరిగిన వృద్ధికి అను పాతంగా ఉపాధి అవకాశాల కల్పనలో వృద్ధి చోటు చేసుకోలేదు. శాశ్వత ఉపాధి వృద్ధి తక్కువగా ఉండటం, శ్రామిక చట్టాలు కఠినంగా ఉండటంతో దేశంలో నిరుద్యోగం అనేది ప్రధాన సమస్యగా మిగిలిపోయింది. రక్షిత విధానంతో కూడుకొన్న కొన్ని రకాల పరిశ్రమల్లో కూడా ఉపాధి కల్పనలో ఎటువంటి వృద్ధి చోటు చేసుకోలేదు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎగుమతుల విషయంలో పోటీతత్వాన్ని పెంపొందించుకోవడానికి అవలంబించే ఉత్పత్తి పద్ధతులతోపాటు నైపుణ్యం ఉన్న శ్రామికుల అవశ్యకత ఎర్పడడం కూడా శ్రామికుల్లో నిరుద్యోగం పెరగడానికి కారణమైంది. అయితే శ్రామికశక్తిలో కొద్దిస్థాయిలో ఉన్న నైపుణ్యం గల పనివారు(skilled workers) పెరుగుతున్న డిమాండ్ నుంచి లబ్ధి పొందుతున్నారు. పోటీతత్వాన్ని పెంపొందించుకునే క్రమంలో.. విదేశీ, స్వదేశీ సంస్థల యాజమాన్య విధానాలు కూడా నైపుణ్యంలేని శ్రామికుల పట్ల ప్రతికూలంగా ఉన్నాయి.



11వ ప్రణాళిక-ఉపాధి నిర్ణయించే కారకాలు:

11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో మొత్తం శ్రామికశక్తికి అదనంగా 45 మిలియన్ల మంది శ్రామికులు తోడు కాగలరని ఒక అంచనా. మొత్తం 58 మిలియన్ల మందికి ఉపాధి కల్పించాలని ఈ ప్రణాళిక లక్ష్యంగా నిర్దేశించుకుంది. శ్రమ సాంద్రతతో కూడుకొన్న తయారీ, సేవల రంగాలైన ఆహార ప్రాసెసింగ్, లెదర్ ఉత్పత్తులు, ఫుట్‌వేర్, టెక్స్‌టైల్స్, వజ్రాలు, ఆభరణాలు, హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్‌లూమ్స్, పర్యాటక, నిర్మాణ రంగాల్లో ఉపాధి పెంచే దిశగా ఈ ప్రణాళికలో చర్యలు చేపడతారు. ఉపాధి కల్పన, కార్మిక(శ్రామిక) మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో వృద్ధి మందగించడంతో వజ్రాలు, ఆభరణాలు, రవాణా, ఆటోమొబైల్, ఐటీ, అనుబంధ సర్వీసులు, నిర్మాణ రంగంలో ఉపాధి తగ్గింది.

ఉపాధి రహిత వృద్ధిని విశ్లేషించే క్రమంలో.. సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధిని నిర్ణయించే కారకాలు:

- ప్రతి శ్రామికుని వేతనం
- శ్రామిక వినియోగం లేదా ప్రతి శ్రామికుని పని దినాలు
- మూలధన కల్పన రేటు
- తయారీ ఉత్పత్తుల సాపేక్ష ధరలు
- చిన్న సంస్థల వృద్ధి
- శ్రామిక నియంత్రణలు

వ్యవసాయం, మౌలిక వస్తువులపై ధరల నియంత్రణను తగ్గించడం.. తయారీ ఉత్పత్తుల సాపేక్ష ధరల తగ్గుదలకు దారి తీసింది. ఈ చర్య తయారీ రంగంలో ధరల పోటీతత్వానికి దారి తీసింది. 1990వ దశకం మధ్య భాగంలో ఆధునికీకరణ, సామర్థ్యం పెంపుదలపై పెట్టుబడులు తగ్గాయి. చిన్న, మధ్య తరహా సంస్థల సమర్థతను పెంచకపోవడంతో దేశంలో ఉపాధి కల్పన రేటు తగ్గింది.

అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చినపుడు

మొత్తం శ్రామికశక్తిలో వృత్తిపరమైన శిక్షణ పొందిన యువ శ్రామికుల శాతం (అంతర్జాతీయ పోలిక)

దేశం	వయసు గ్రూపు	మొత్తం శ్రామికశక్తిలో వృత్తిపరమైన శిక్షణ పొందిన శ్రామికుల మొత్తం (శాతంలో)
ఇండియా	20-24	5.06
అభివృద్ధి చెందుతున్న దేశాలు		
బోట్స్‌వానా (Botswana)	20-24	22.42
కొలంబియా	20-29	28.06
మారిషస్	20-24	36.08
మెక్సికో	20-24	27.58
అభివృద్ధి చెందిన దేశాలు		
ఆస్ట్రేలియా	20-24	64.11
కెనడా	20-24	78.11
జపాన్	15-24	80.39
సింగపూర్	20-24	66.24
బ్రిటన్	20-24	68.46

ఆధారం: ప్రణాళికా సంఘం

మొత్తం శ్రామికుల్లో వృత్తిపరమైన శిక్షణ పొందిన యువ శ్రామికుల శాతం మన దేశంలో తక్కువ. స్థిర వృద్ధి సాధనకు వృత్తిపరమైన శిక్షణ పొందిన శ్రామికులు తక్కువగా ఉండటం కూడా ఒక అవరోధంగా భావించవచ్చు. 9 శాతం వృద్ధిరేటు సాధించే క్రమంలో..తయారీ రంగ వృద్ధిని వేగవంతం చేయాల్సి న అవసరం ఉంది. మన దేశంలో స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగ వాటా 16.10 శాతం. కాగా చైనాలో ఈ రంగ వాటా ఆ దేశ జీడీపీలో 39.41 శాతం. మన దేశంలో తయారీ రంగం పూర్తిగా వెనుకబాటుకు కారణం నైపుణ్యం లేని శ్రామికులతో పాటు సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉండటమే. ప్రపంచ మార్కెట్ లో మన దేశానికి తయారీ రంగం వల్ల కలిగే తులనాత్మక ప్రయోజనం తక్కువగా ఉండటానికి ఇది ప్రధాన అవరోధంగా పరిణమించింది. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు మందగించడంతో పాటు తయారీ రంగం అధికంగా ఉపాధి కల్పించలేకపోవడం నిరుద్యోగ సమస్య తీవ్రం కావడానికి కారణమైంది. 1993-94 తర్వాత నిరుద్యోగిత రేటు పెరగడం ప్రారంభమైంది. 1999- 2000 తర్వాత గ్రామీణ, పట్టణ స్త్రీ, పురుషుల్లో నిరుద్యోగం పెరిగింది. మహిళల్లో నిరుద్యోగిత, పురుష నిరుద్యోగిత కంటే ఎక్కు వే. కానీ తర్వాత కాలంలో వీరి మధ్య తేడా కొంత తగ్గింది.

పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత నిరక్షరాస్యుల్లో ఎక్కువ. కాగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యావంతుల్లో నిరుద్యోగిత ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పెరుగుతున్న వలసలు పట్టణ ప్రాంతాల్లో నేర్పరితనం లేని శ్రామికులు పెరగడానికి కారణమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న శ్రామికుల (Skilled Labourers)కు డిమాండ్ లేకపోవడం వల్ల విద్యావంతులైన శ్రామికులకు ఉపాధి లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం శ్రామికుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ప్రకటించిన స్కిల్ డవలప్‌మెంట్ (Skill Development) పథకాలు పెరుగుతున్న శ్రామిక అవసరాలను తీర్చలేదు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత వృద్ధిని పరిశీలించినపుడు.. గత కొన్నేళ్లుగా ఉద్యోగిత కల్పనకు అవసరమైన వనరుల

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగిత కల్పన కార్యక్రమాలకు వనరుల పంపిణీ (రూ. కోట్లలో)

సంవత్సరం	గ్రామీణ ఉద్యోగిత	పట్టణ ఉద్యోగిత (స్వర్ణజయంతి షహరీ రోజ్‌గార్ యోజన)	మొత్తం ఉద్యోగిత కల్పన కార్యక్రమాలు
1998-99	3690.02	162.28	3852.30
1999-00	3727.30	126.35	3853.65
2000-01	2801.22	95.03	2896.25
2001-02	4591.39	45.50	4636.89
2002-03	9870.56	105.00	9975.56
2003-04	10129.18	105.00	10234.18
2004-05	7118.00	122.00	7240.00
2005-06	11700.00	159.99	11859.99
2006-07	12870.00	250.00	13120.00

ఆధారం: వివిధ బడ్జెట్‌లు

పంపిణీ జరగడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం వనరుల పంపిణీలో రక్షణ రంగానికి ప్రాధాన్యతనిస్తూ.. మరోవైపు పెరుగుతున్న ద్రవ్య లోటు తగ్గించడానికి ప్రయత్నిస్తోంది. ఈ స్థితి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరగడానికి కారణమైంది. మొత్తం వ్యయంలో ప్రాథమిక విద్యకు ప్రాధాన్యమిస్తూ సాంకేతిక విద్యకు తక్కువ నిధులు కేటాయించడం కూడా నైపుణ్యం లేని శ్రామికులు (unskilled workers)పెరగడానికి కారణమైంది. అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా మన దేశంలో వృత్తిపరమైన శిక్షణ పెంపుదలకు విద్యారంగ కేటాయింపుల నుంచి సాంకేతిక విద్యకు ఎక్కువ నిధులు కేటాయించాలి.

ముఖ్యాంశాలు:

- 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో శ్రామికశక్తికి అదనంగా 45 మిలియన్ల మంది శ్రామికులు చేరనున్నారు.
- 1994-2006 మధ్య కాలంలో సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి రేటు 0.12 శాతం.
- ప్రస్తుతం వృద్ధిరేటు మందగించిన నేపథ్యంలో వజ్రాలు, ఆభరణాలు, రవాణా, ఆటోమొబైల్, నిర్మాణరంగం, ఐటీ, అనుబంధ సర్వీసుల్లో ఉపాధి తగ్గింది.
- దేశంలో 20-24 సంవత్సరాల వయోవర్గంలో మొత్తం శ్రామికుల్లో వృత్తిపరమైన శిక్షణ పొందిన యువ శ్రామికుల వాటా 5.06.
- మన దేశ జీడీపీలో తయారీ రంగం వాటా 16.10 శాతం. కాగా చైనా జీడీపీలో ఆ రంగ వాటా 39.41 శాతం.